అభివృద్ధిలో శరవేగం

- ప్రగతి పథంలో 14వ వార్డు
- రూ.11 కోట్లతో జోరుగా పనులు


రాధాకృష్ణా లేవుట్‌లో కొత్తగా నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న కె.కె.రాజు, అనిల్‌కుమార్‌రాజు


స్నేపర్ పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధి 14వ వార్డు అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. అందాల విశాఖ నగరానికి మరింత వన్నె తెచ్చేలా ఈ వార్డు అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. మొత్తం రూ.11 కోట్ల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అందులో సుమారు రూ.7 కోట్లతో పలు పనులు పూర్తి చేశారు. రోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనాలు, ప్రహరీలు, పార్కుల నిర్మాణం, అభివృద్ధితోపాటు తాగునీటి సౌకర్యం, వాటర్ వర్క్స్, జనరల్ వర్క్ పనులు శరవేగంగా జరిగాయి. మరో రూ.4 కోట్ల పనులకు అగ్రిమెంట్‌లు జరిగాయి. జూన్ నెలాఖరులోగా వాటిని పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేవుట్‌లో వార్డు సచివాలయ భవనం నిర్మిస్తున్నారు. దీంతోపాటు అనేక అభివృద్ధి పనులకు ఇటీవల శంకుస్థాపనలు చేశారు.

అదిరేలా స్నేపర్ పార్కు..

బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో అన్ని వసతులతో అత్యంత సుందరంగా స్నేపర్ పార్కు(రాకెట్ పార్కు)ను రూ.2.50 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో ఈ పనులు పూర్తి కానున్నాయి. పార్కులో నాలుగు వాకింగ్ ట్రాక్‌లు, సీతాకోకచిలుకల ఉత్పత్తి కేంద్రం, పిల్లలు ఆట స్థలం, వర్షం ఆశ్రయాలు, పెర్గోలా నాలుగు, లిల్లీపాండ్, పెవిలియన్, టాయిలెట్స్, గెజిబో, ధ్యానం, యోగా కేంద్రాల ఏర్పాటు చేస్తున్నారు. వాటితోపాటు యాంఫి థియేటర్, నీటి సరఫరా, బిందు సేద్యం వ్యవస్థ ఏర్పాటు పనులు పూర్తి కావచ్చాయి.

వార్డులో చేపట్టిన పనులు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తోంది. ప్రతిపక్షాలు నోళ్లు మూసుకునేలా రహదారులను అద్దంలా నాణ్యంగా నిర్మిస్తోంది. ఈమేరకు బాలయ్యశాస్త్రి లేవుట్‌లో రూ.15 లక్షలతో రోడ్డు పనులు శరవేగంగా పూర్తి చేశారు. ఎన్ఆర్ఐ హాస్పిటల్, గణేష్‌బాబు హాస్పిటల్ రోడ్డు పనులు, అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి బాలికల పాపా హోం వరకు రూ.3 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. రాధాకృష్ణా లేఅవుట్ నుంచి నర్సింహనగర్‌కు కొత్త రహదారి నిర్మించారు. పోర్టు స్టేడియం వద్ద గణేష్ నగర్ ప్రాంతం వెనుక తారు రోడ్డు పనులు పూర్తి చేశారు. సుమారు రూ.15.50 లక్షలతో రహదారులను సుందరీకరించారు. మూడు రోజుల కిందట నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయిబాబా దేవాలయ రహదారిలో రూ.2.53 కోట్లతో అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేశారు. వార్డులో అభివృద్ధి పనులు జోరందుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


బాలయ్యశాస్త్రి లేవుట్‌లో నిర్మిస్తున్న సచివాలయ భవనం

వార్డు అభివృద్ధే ధ్యేయం

వార్డులో సుమారు రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశాం. గణేష్‌నగర్, నర్సింహనగర్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నార్త్ ఎక్స్‌టెన్షన్‌తోపాటు మరిన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా వార్డు అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నాను.

– కటారి అనిల్‌కుమార్‌రాజు, కార్పొరేటర్, 14వ వార్డు

ప్రజారోగ్యానికి సీఎం జగన్ ప్రాధాన్యం


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని. చిత్రంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ కవిత

- ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని
- 48వ వార్డులో అర్బన్ హెల్త్, వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభం


ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజని

కంచరపాలెం: ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని అన్నారు. జీవీఎంసీ 48వ వార్డు బర్మాక్యాంప్ ఇందిరానగర్‌లో రూ.1.06 కోట్ల ఎన్‌యూహెచ్‌ఎం నిధులతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను శనివారం ముఖ్య అతిథులు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ గంకల కవితలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించే దిశగా సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి కృషి చేస్తున్నారన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందేలా కార్పొరేట్ స్థాయిలో ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. 63 రకాల వైద్య పరీక్షలు, 19 మంది వైద్య సిబ్బందితో వార్డు ప్రజలకు చేరువగా అర్బన్ హెల్త్ సెంటర్‌ను తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్.రాజేంద్ర, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు శ్రీనివాసరావు, అర్చన, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, సారిపిల్లి గోవింద్, బర్కత్ అలీ, కె.అనిల్‌కుమార్‌రాజు, కంటిపాము కామేశ్వరి, కె.వి.ఎ స్.శశికళ, ఆళ్ల లీలావతి, సాడి పద్మారెడ్డి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, సీనియర్ నాయకులు ఎస్.అప్పారావు, పిల్లి సుజాత, భరణికాన రామారావు, పేడాడ రమణికుమారి, కిరణ్‌రాజు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు, ఆయా వార్డు అధ్యక్షులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.5 లక్షలతో కాంపౌండ్ వాల్ పనులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో రూ.5 లక్షల వ్యయంతో కాంపౌండ్ వాల్ పనులకు శనివారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, 24వ వార్డు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినులకు పాఠ్యపుస్తకాల పంపిణీ


విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం రాంప్రసాద్

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలోని జీవీఎస్‌ఎంసీ హైస్కూల్, కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థినులకు జగనన్న విద్యా కానుకలో భాగంగా శనివారం పాఠ్యపుస్తకాలను హెచ్‌ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం(ఎంపీసీ), జంతు శాస్త్రం, వృక్ష శాస్త్రం(బైపీసీ) బుక్స్‌ను అందించామన్నారు. ప్రస్తుతం తెలుగు, ఇంగ్లిష్, గణిత, భౌతిక, రసాయనిక, జంతు శాస్త్రాల సబ్జెక్టులకు అధ్యాపకులు ఉన్నారని చెప్పారు. జీవ శాస్త్రానికి అధ్యాపకుడిని నియమించాల్సి ఉందన్నారు. ఈ నెల 1 నుంచి ఇంటర్ క్లాసులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సెకండియర్‌లో 26 మంది బాలికలు ఉన్నారని, ఫస్ట్ ఇయర్‌లో పది మంది చేరారని వెల్లడించారు. కార్యక్రమంలో జి.ఎ స్.వి.వరలక్ష్మి, జేసుదాస్ విక్టర్, జి.ప్రియదర్శిని, త్రినాథ్, ఎస్.భారతి పాల్గొన్నారు.

లలితా సహస్ర నామాల ఆవిర్భావంపై ప్రవచనం


ప్రవచిస్తున్న రమ్యానంద భారతీ స్వామిని

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని రెండో రోజు శనివారం వారాహి వైభవంపై ప్రవచించారు. లలితా సహస్ర నామాల ఆవిర్భావం, నామావళి పారాయణ వైశిష్ట్యాన్ని వివరించారు. బండాసుర సంహార సందర్భంలో లలితాదేవి పరాక్రమ అంశ మహా వారాహిగా అవతరించినట్టు బ్రహ్మాండ పురాణం పేర్కొందని తెలిపారు. హయగ్రీవ అగస్త్య మహర్షుల సంవాదం, శ్రీచక్ర రథ వైశిష్ట్యాన్ని ప్రవచించారు. లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన లహరిలో పలువురు భక్తులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


రేసపువానిపాలెంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 24వ వార్డు చైతన్యనగర్ సచివాలయం(10 861 39) పరిధి రేసపువానిపాలెంలోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా.. నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో విశాఖ నగరం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేలా చర్యలు చేపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, ఏపీడీ దుర్గాప్రసాద్, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, కిరణ్‌రాజు, డైరెక్టర్ రాయుడు శ్రీనివాస్, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు గుడ్ల అశోక్‌రెడ్డి, బి.రామిరెడ్డి, సీతాకుమారి, లావణ్య, శివరంజిని, మురళీకృష్ణ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, అర్చకులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. గొల్ల సన్నిధి సేవ నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పేదల ఆకలి తీర్చడంలో ఆనందం


అన్నదానం చేస్తున్న అప్పారావు

కంచరపాలెం: పేదల ఆకలి తీర్చడంలో ఎంతో ఆనందం ఉంటుందని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అన్నారు. కంచరపాలెం రాంజీ ఎస్టేట్‌లో రాంజీ అభ్యుదయం సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన అన్నార్తులకు భోజనం వడ్డించి మాట్లాడారు. సంఘం అనేక సేవా కార్యక్రమాలతోపాటు ప్రతి శనివారం పేదలకు అన్నదానం చేయడం ఆదర్శనీయమన్నారు. దళితుల అభ్యున్నతితోపాటు తాను కూడా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పట్నాల ఝాన్సీ, పుచ్చా కామేశ్వరరావు, తాటిపూడి సీతారామ్, గొల్లమాల మీనా, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం గుర్తుతెలియని ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు వెంటనే అతడిని 108లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఈ వ్యక్తి మరణించాడు. రైల్వేస్టేషన్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు సూచనలతో ఎస్ఐ కామేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వయసు 45 ఏళ్లు ఉండవచ్చు. ఇతని వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ స్టేషన్ వద్ద స్వయంగా గానీ, లేదా 94934 24987, 0891 2882910 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్ఐ కామేష్ కోరారు.

సంపత్ వేంకటేశ్వరుడికి విశేష పూజలు


వేంకటేశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకుడు

కంచరపాలెం: గొల్ల కంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, తులసీ దళ బిల్వార్చనలు జరిపారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు, సేవా దళ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం నక్షత్ర హారతి, భక్తి సంకీర్తన, పవలింపు సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

కలియుగ వెంకన్నకు..

తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్ శర్మ, జగన్నాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడుదాం


హాజరైన ప్రజా సంఘాల ప్రతినిధులు


మాట్లాడుతున్న కమిటీ వైస్ చైర్మన్ గోపీనాథ్

సీతంపేట: దేశాన్ని మతోన్మాదం నుంచి రక్షించి దేశ సంపదను కాపాడటమే భారత్ బచావో కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని కార్డియాలజిస్ట్, భారత్ బచావో జాతీయ కమిటీ వైస్ చైర్మన్ ఎం.ఎఫ్.గోపీనాథ్ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన భారత్ బచావో జిల్లా సదస్సులో ముఖ్య వక్తగా ఆయన ప్రసంగించారు. నేడు హిందూ మతోన్మాదం ప్రమాదకరంగా మారిందని, దానికి కారణం ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలే అన్నారు. హిందూయిజం పేరుతో దేశంలో ప్రజల మధ్య విభేదాలు సృష్టించి హింసలకు పాల్పడి అల్లకల్లోలం రేపుతారని నాడే పూలే, అంబేడ్కర్, స్టాలిన్ వంటి మహనీయులు హెచ్చరించారని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్‌కు ప్రధాన శత్రువులు ముస్లింలు, క్రైస్తవులు, వామపక్షాలు, దళితులన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ బీజేపీ అధికారంలోకి వచ్చాక 2014 ముందు.. ఆ తర్వాత దేశ పరిస్థితిని సమీక్షించుకోవలసిన అవసరం ప్రజాస్వామ్య వాదులకు ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ తరుణంలో దేశాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ మోదీ పాలనలో పేదల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందన్నారు. ప్రభుత్వ సంస్థలను ఒక్కొక్కటి అమ్మేస్తూ దేశ సంపదను కొద్ది మంది చేతుల్లో పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గూడూరు సీతామహాలక్ష్మి, చైర్మన్ సి.భాస్కరరావు, ప్రొఫెసర్ సత్యపాల్, కార్యదర్శులు దుడ్డు ప్రభాకర్, జి.వి.రంగారెడ్డి, పొన్నాడ శ్రీనివాస్, ఆర్.వేమన, పౌర, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల సెలవులు పొడిగించాలి

సీతమ్మధార: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పాఠశాలల వేసవి సెలవులు పొడిగించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం ‘సాక్షి’తో ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో విద్యార్థులు తట్టుకోలేరని, ప్రభుత్వం పరిశీలించి ఎండ తీవ్రత తగ్గే వరకు సెలవులు పొడిగించాలని సూచించారు.

డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో డీఆర్‌ఎం పర్యటన


రైల్వే కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో శనివారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆకస్మికంగా పర్యటించి, అక్కడి ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ ప్రాంతంలో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసుల ద్వారా ఆయన తెలుసుకున్నారు. విద్యుత్ కోతలకు గల కారణాలను సిబ్బందిని అడిగి డీఆర్‌ఎం తెలుసుకున్నారు. మరింత విద్యుత్ సరఫరా అవసరముందని గ్రహించి అధిక సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్స్, ఇతర పరికరాలను సమకూర్చుకోవాలని అధికారులకు ఆదేశించారు. మరి కొద్ది రోజుల్లోనే విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. విద్యుత్ ఆదాకు అవసరమైన పద్ధతులను కాలనీ వాసులు అవలంబించాలని సూచించారు. పర్యటనలో ఇతర అధికారులు, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన అమెరికన్ ఇంగ్లిష్ శిక్షణ


సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన విద్యార్థులు

సీతంపేట: తన్మయ్ క్రియేటివ్స్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అమెరికన్ ఇంగ్లిష్ శైలిపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షకుడు సనపల జీవన్‌కుమార్ మాట్లాడుతూ భాషతోపాటు భావం కూడా ముఖ్యమని, అమెరికన్ శైలి మెళకువలతో తెలుగువారు కూడా మంచి స్థాయిలో నిలవొచ్చన్నారు. అమెరికన్ ఆంగ్ల శైలి, భాష ఉచ్చారణ, రాయడంలోనూ, మాట్లాడటంలోనూ ఉండే వ్యత్యాసాలను వివరించారు. శిక్షణకు హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్లు బహూకరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎస్.నాగేశ్వరరావు, తన్మయి సంస్థ కార్యదర్శి సిహెచ్.వి.సత్యనారాయణ, కొణతాల రాజు, గ్రంథి సతీష్‌కుమార్, ఉప్పాడ రాము, ఎం.వి.రాజశేఖర్, బాదం గీర్ సాయి పాల్గొన్నారు.

జ్ఞాపక శక్తిపై విద్యార్థులకు పోటీలు


మెమొరీ గేమ్‌లో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గణిత ఉపాధ్యాయుడు ఎం.శంకర్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు జ్ఞాపక శక్తిపై పోటీలు నిర్వహించారు. ఒకే సారి 25 రకాల వస్తువులను చూపించి వాటి పేర్లు చూడకుండా చెప్పే పోటీలు ఉత్సాహంగా సాగాయి. మురళీనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. షార్ట్, లాంగ్ మెమొరీ అభివృద్ధి చేసుకునే విధానాలను శంకర్ వివరించారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షించారు. విజేతలకు ఆదివారం నిర్వహించే ప్రత్యేక సమావేశంలో బహుమతులు అందిస్తారు.

మసీదు డ్రైనేజీ పునరుద్ధరణకు వినతి

సీతమ్మధార: బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ, జీవీఎంసీ అవసరాల నిమిత్తం 2012లో రామాటాకీస్ వద్ద ఉన్న యాసీన్ మసీదు స్థలం తీసుకున్నారని, మసీదు డ్రైనేజీ భాగం కొంత పోవడంతో దాని పునరుద్ధరణకు సహకారం అందించాలని కోరుతూ శనివారం 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డికి మసీదు ప్రతినిధులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మసీదు వద్ద డ్రైనేజీ డిస్టర్బ్ కావడంతో ప్రమాదం ఏర్పడుతోందని, వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఖాజీ అల్లాజ్ మొహమ్మద్ అహమతుల్లాఖాన్, సయ్యద్ మొహమ్మద్, దేవరకొండ మార్కెండేయులు, మొహమ్మద్ ఇబ్రహీం పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: నటరత్న కల్చరల్ అసోసియేషన్, స్వర మాలిక, స్వరరాగ తరంగిణి సంస్థలు సంయుక్తంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. భయ్యా శ్రీనివాస్, అల్లిపిల్లి నరసింగరావు, ఆంజనేయ రెడ్డి గళాల నుంచి వెలువడ్డ సోలో సాంగ్స్, యుగళ గీతాలు ఆహుతులను ఉర్రూతలూగించాయి. కళారంగ ప్రముఖులు సన్‌మూర్తి, చెన్నా తిరుమలరావు, నాంచారయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు.